క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి, మహాత్రిపుర సుందరి మానస లింగేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వారణాసి గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్.కొత్తూరుకు చెందిన బండారు బాలరాజు భక్తులకు అల్పాహారం, భోజన వసతి ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: రాష్ట్ర స్థాయి సీనియర్ మీట్ కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి శనివారం తెలిపారు. గత నెలలో నందికొట్కూర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి సాయి,, బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సౌమ్య సత్తా చాటారన్నారన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

దేవతలకు ఆదిదేవుడు విష్ణుమూర్తి



హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): ముప్పది మూడు కోట్ల దేవతలకు అధినాయకుడు విష్ణుమూర్తి అని తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. శనివారం సంజీవనగర్ రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 20వ రోజు 20వ పాశురాన్ని భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవతలకు ఎటువంటి హాని తలపెట్టినా రక్షించే నాథుడు విష్ణుమూర్తి అని గోదాదేవి గోపికలకు వివరిస్తున్న పాశురాన్ని వివరించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



గోవిందపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 3న పాయకరావు పేట మండలం సత్యవరం గ్రామంలో పింఛన్ల పరిశీలన సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ పట్ల తహసీల్దార్ దురుసగా ప్రవర్తించారని ఉద్యోగులు ఆరోపించారు. జిల్లా సంఘం పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తాము తోటి ఉద్యోగస్తులమేనని, తమను చిన్న చూపు చూడవద్దని మండల, జిల్లా స్థాయి అధికారులను కోరారు.

మహిళల అభ్యున్నతికి పాటుపడిన సావిత్రీ బాయి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మహిళల అభ్యున్నతికి పాటు పడిన వనిత సావిత్రీబాయి పూలే అని, ఆమె జయంతిని నిర్వహించుకోవడం సంతోషకరమని శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినికేతన్ విద్యాసంస్థల్లో బిజ్జం సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

నంద్యాల(వ్యవసాయం): సావిత్రీ బాయి పూలే, షేక్ ఫాతిమా జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని బాలా అకాడమీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. ఆల్‌మేవా ఏపీ యూనిట్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా ఎన్ఎండీ ఫయాజ్ హాజరై మాట్లాడారు.డాక్టర్ నిరంజన్, రవీంద్రనాథ్, మాధవీలత, అబులైజ్, షేక్‌నబీరసూల్, సయ్యద్ పాల్గొన్నారు.



చాబోలు వద్ద లైటు వేసుకొని వస్తున్న వాహనదారుడు



క్రాంతినగర్‌లో చలిమంట వేసుకున్న దృశ్యం

మంచుకురిసే వేళలో..

నంద్యాల(అర్బన్): మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. శనివారం ఉదయం 8గంటల వరకు దట్టంగా మంచు కురవడంతో రహదారులపై రాకపోకలు సాగించడం వాహనదారులకు కష్టతరమైంది. వాహన ప్రయాణానికి మంచు తీవ్ర ఆటంకం కలిగిస్తుండటంతో వాహనాలు రోడ్డు పక్కనే లైట్లు వేసి పార్కింగ్ చేసుకుంటున్నారు. పలువురు తక్కువ వేగంతో హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణం సాగిస్తున్నారు. ఇక చలిని తట్టుకునేందుకు పల్లెల్లో జనం చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.



చాపిరేవులలో పంట పొలాలను కప్పేసిన పొగ మంచు

పాఠశాల ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకోండి

- పదిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి పాఠశాల ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాల ర్యాంకింగ్, పదవ తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతంపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన తీరు, టాయిలెట్లు, తాగునీటి వసతి, కిచెన్ గార్డెన్స్, లైబ్రరీ బుక్స్, ఇష్యూ రిజిస్టర్ తదితర సదుపాయాలపై పాఠశాలల వారీగా స్టార్ రేటింగ్ ఇస్తారని, ఇందుకనుగుణంగా పాఠశాలల రేటింగ్ స్థాయిని మెరుగుపరుచుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపొందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. వచ్చేవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల అంశంపై ప్రతివారం సమీక్షిస్తానని స్పష్టం చేశారు. డీఈఓ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.


గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల రూరల్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు విక్రేతలను శనివారం తాలుకా పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన జింకల మద్దిలేటికి కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వాసుతో పరిచయం ఉండేది. వాసు ద్వారా ట్రైన్‌లో కొంత కాలం నుంచి నంద్యాలకు గంజాయిని తరలిస్తూ విక్రయిస్తున్నారు. మద్దిలేటి నుంచి మహాదేవాపురం గ్రామానికి చెందిన బొంత శ్రీనివాసులు కొనుగోలు చేసి అయ్యలూరు మెట్ట సమీపంలోని టీస్టాల్ యజమాని షేక్ యూసూఫ్‌కు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ గంగయ్య యాదవ్, ఏఎస్ఐ హరినాథ్‌రెడ్డి, హెచ్‌సీ చంద్రశేఖర్, ఆయూబ్‌ఖాన్ అరెస్ట్ చేసి వారి నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. తాలుకా ఎస్ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయం, తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలోని వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేపట్టి పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. విష్ణుసహస్ర నామావళి అష్టోత్తర శతనామావళి నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో లోక కల్యాణం కోసం సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారికి సామూహిక తులసీ అర్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలంకృతమైన పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో ఆలయాలకు శనివారం భక్తులు ఉదయాన్నే చేరుకుని పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన రెండవ విడత గ్రామ సభలకు రైతుల నుంచి స్పందన కరువైంది. మండలంలోని కాకరవాడ గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామంలో 1,366 మంది రైతులకు సంబంధించి 3,332 ఎకరాల్లో భూములకు రీ సర్వే చేపట్టవలసి ఉంది. అయితే ఈ గ్రామ సభకు కేవలం 10 మందిలోపే రైతులు హాజరు కావడం, భూ సమస్యలపై ఎలాంటి దరఖాస్తులు అందజేయలేదు. తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ పురుషోత్తం పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో శనివారం గ్రామ రెవెన్యు సదస్సుకు తహసీల్దార్ రవికుమార్ మధ్యాహ్నం 12:30 గంటల తరువాత ఆలస్యంగా రావడంతో సభకు వచ్చిన ప్రజలు వెళ్లిపోయారు. కూటమి నాయకులతో సభ నిర్వహించి మమ అనిపించారు. సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు మాట్లాడుతూ.. అధికారులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు.

పిల్లల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి





చిన్నారులకు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, డబ్బ్యాగోవిందిన్నెలో..

ఆళ్లగడ్డ: పిల్లల సంరక్షణ, ఎదుగుదల బాధ్యతగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్) డే వేడుకలు నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ సాధ్యమైనంత తొందరగా అందించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులను ఆకర్షించేలా రకరకాల బొమ్మలు వస్తువులతో అలంకరించారు.

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య సంరక్షణ మరియు విద్య చరిత్ర (ఈసీసీఈ డే)ను నిర్వహించారు. 3–6 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని మెటీరియల్ ఉపయోంచి నేర్చుకున్న విద్యను తల్లిదండ్రుల సమక్షంలో చూపించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు తులశమ్మ, జ్ఞానమ్మ, సుబ్బమ్మ, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

రుద్రవరం:అంగన్‌వాడీ కేంద్రాల నుంచే చిన్నారులకు ఆట,మాట,పాటలతో పాటు విద్యాబుద్దులు అలవర్చుతామని సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని కోటకొండ రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లులు,గర్భిణులు,బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చాగలమర్రి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హూడ్ అండ్ కేర్ ఏడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు.

అర్హులకు టిడ్కో గృహాలు అందజేయాలి

నంద్యాల(న్యూటౌన్): అర్హులందరికీ టిడ్కో గృహాలు పంపిణీ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోటమద్దులు, పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం వారు టిడ్కో గృహాలను పరిశీలించారు. కేటగిరీల ప్రకారం ఇళ్లను అందజేస్తామని, ఇంత వరకు ఇవ్వలేదన్నారు. పలువురు వ్యక్తులు రెండు కంటే ఎక్కువ ఇళ్లను సొంతం చేసుకున్నారని, విచారణ చేసి అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తాగునీరు, రోడ్లు, కాల్వలు, వీధిలైట్లు, పాఠశాలలు, అవసరమైన వాటిని వెంటనే కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకండి

దొర్నిపాడు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కం ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్ చార్జీలపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరు కావాలని వినియోగదారులకు విద్యుత్‌శాఖ ఏఈ రామ్మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10న కర్నూలు నుంచి ఏపీ ఈఆర్సీ ఉన్నతాధికారులు హైబ్రిడ్ విధానంలో అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. నంద్యాలలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అభ్యంతరాలు తెలియజేవచ్చన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హాజరు కావచ్చన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలపవచ్చన్నారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు నుంచి కిందపడి విద్యార్థికి గాయాలు

గోస్పాడు: స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో జరిగిన ప్రమాదంలో విద్యార్థి ఆవుల చరణ్ తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎం.చింతకుంట్ల గ్రామానికి చెందిన ఆవుల చరణ్ గోస్పాడు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే స్కూలుకు వచ్చి అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా బస్సు ముందు కదలడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో విద్యార్థి తీవ్రంగా గాయపడగా వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

ఆళ్లగడ్డ: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉద్యోగ మేళా జరిగింది. ఇందులో 26 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన యువతకు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. అలాగే.. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

బొమ్మలసత్రం: 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయటం చట్టవిరుద్ధమని, అందరం కలిసి ఈ విధానాన్ని వ్యతిరేకించాలని త్రీటౌన్ సీఐ సూర్యమౌళి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని రామలింగారెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఆపద సమయంలో 100 ,102 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

శిరివెళ్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏంఈఓ శంకరప్రసాదు అన్నారు. శనివారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఏజెన్సీలను ఆదేశించారు. మొదటి రోజు 171 మంది విద్యార్థులకు గాను 153 మంది భోజనం చేశారు. ఎంఈఓ–2 నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి, ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, ప్రసాదరెడ్డి, సీఆర్పీ గుర్రప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

• తెలుగుగంగ కట్ట బలోపేత పనులు



శుభ్రమైన కాల్వ కట్ట



కోటకొండ సమీపంలో కట్టపై మట్టిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

రుద్రవరం: మండలంలోని కోటకొండ గ్రామ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో కట్ట శుభ్రంగా మారి రైతుల రాక పోకలకు సులువుగా మారింది. నిన్నటి వరకు కాల్వ కట్టకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఏపుగా పెరిగి దారంతా మూసుకు పోయిండేది. అలాగే కట్టపై పెద్ద పెద్ద వాహనాలు తిరిగడంతో గుంతలు ఏర్పడి రైతుల వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి ప్రధాన కాల్వ కట్టపై మెటల్ రోడ్డు పనులు చేపట్టారు. వాటికి సంబధించి మహానంది మండలం గాజులపల్లె రైల్వే స్టేషన్ వరకు పూర్తి చేసి నిలిపేశారు. ప్రస్తుతం శిరివెళ్ల మండలం, రుద్రవరం మండలం వైపు కాల్వ కట్టపై పనులు చేపట్టారు. ఇందులో భాగంగానే ఎక్స్‌కవేటర్‌తో కాల్వ కట్టకు ఇరువైపులా కంప చెట్లను తొలగించారు.అలాగే మట్టి తోలించి గుంతలను చదును చేశారు.

సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ కింద 36 గ్రామాలకు తాగునీరు



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

నంద్యాల(అర్బన్): మండలంలోని అబాండం తండా గ్రామ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం) ద్వారా నంద్యాల నియోజకవర్గంలోని 36 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని కర్నూలు జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి తెలిపారు. పథకం కింద జరుగుతున్న పనులు, తాగునీటి సరఫరాను శనివారం ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఏఈలు ప్రమోద్, మురళీనాయక్‌తో పాటు ఎంపీడీఓ సుగుణశ్రీ, పలు గ్రామాల సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ డ్యామేజీ, నీటి సరఫరాలో అంతరాయాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి గ్రామాల అభివృద్ధి, పింఛన్ల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్‌డీ జ్యోతి, ఏఓ షాను పాల్గొన్నారు.

ఘనంగా లూయీస్ బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆడిటోరియంలో శనివారం సర్ లూయీస్ బ్రెయిలీ 215వ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ జహరుద్దీన్ మాట్లాడారు. ఆదరణ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరియదాసు, ప్రతాపరెడ్డి, దివాకర్‌రెడ్డి, మద్దిలేటి, రమేష్ పాల్గొన్నారు.

చాగలమర్రి: చూపు లేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని ప్రధానోపాధ్యాయుడు ఐడీకే శాస్త్రి అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బ్రెయిలీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీకెండ్‌లో అధికారులు..

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా కుర్చీలు
- కార్పొరేట్ విధానాన్ని అనుసరిస్తున్న ఉద్యోగులు



11గంటల సమయంలో చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీగా కుర్చీలు



ఉపాధి కార్యాలయంలో ఒక్కరే హాజరైన దృశ్యం

చాగలమర్రి: కార్పొరేటు కార్యాలయాల్లో ఉద్యోగులకు వారం చివరి రెండు రోజులు అంటే శని, ఆదివారం సెలవు. దీంతో వారు వీకెండ్ హాలీడేస్‌ను ఎంజాయ్ చేస్తారు. అదే సంప్రదాయం ప్రభుత్వ కార్యాలయాలకు కూడా పాకిందా అంటే స్థానిక ప్రభుత్వ కార్యాలయాలను చూస్తే అవుననక తప్పదు. స్థానిక ఎంపీడీఓ, ఉపాధిహామీ కార్యాలయం, చాగలమర్రితో పాటు మండలంలోని గ్రామ సచివాలయాల్లో శనివారం ఉదయం 11.00 గంటలైనా ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ప్రతి కార్యాలయంలో ఒకరు ఇద్దరు తప్ప ఉద్యోగులెవరూ హాజరు కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగులు లేకపోవడంతో వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలు ఉసూరోమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. మండలంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.